సాక్షి కామారెడ్డి


బుధవారం, 5, మార్చి, 2025



హాజరుశాతం పెంచాలి

ఉపాధి హామీ పనులలో కూలీల హాజరు శాతాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం 36.6 /15.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఎంపీడీవోల సంఘం కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గానికి ఎన్నిక పత్రం అందిస్తున్న జెడ్పీ సీఈవో చందర్

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జెడ్పీ సీఈవో బి.చందర్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షుడిగా టీవీఎస్ గోపిబాబు(మాచారెడ్డి), ప్రధాన కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్(సదాశివనగర్), కోశాధికారిగా ఎల్.రాజేశ్వర్(గాంధారి), ఉపాధ్యక్షులుగా రాణి (మద్నూర్), సంయుక్త కార్యదర్శిగా కమలాకర్ (పిట్లం), కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ సాజిద్ అలీ(తాడ్వాయి), నాగవర్ధన్ (కామారెడ్డి), శ్రీనివాస్ (జుక్కల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సబ్ జైల్ తనిఖీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

కామారెడ్డి టౌన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి మంగళవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, చట్టాలు గురించి వివరించారు. ఫిర్యాదుల బాక్స్, వంట గది, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మాయ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్ రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది శ్రావణ్, ఉదయ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పర్యాటక కేంద్రంగా మారుస్తాం'



జగన్నాథ ఆలయం వద్ద నీటి కొలనును పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

లింగంపేట: లింగంపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తామని డీఆర్డీవో సురేందర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పలు దర్శనీయ స్థలాలను సందర్శించారు. జగన్నాథ ఆలయం వద్ద నీటి కొలను, ఆలయంలోని శివలింగం, సొరంగ మార్గాన్ని, నగరేశ్వర ఆలయం ముందున్న గాలికి ఊగే స్తంభాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేటలో చారిత్రక కట్టడాలు, ప్రసిద్ధి చెందిన క్షేత్రాలు ఉన్నాయన్నారు. వాటిని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. ఇందుకోసం నిధుల మంజూరు కోసం పర్యాటక శాఖకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అనంతరం గ్రామ శివారులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల హాజరు పట్టికను తనిఖీ చేశారు. నర్సరీ, కంపోస్టు షెడ్, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

ఫిక్కీ అవార్డు అందుకున్న సీఐ



అవార్డు అందుకుంటున్న సీఐ గడ్డం మల్లేశ్

భిక్కనూరు: భిక్కనూరు మండలానికి చెందిన గడ్డం మల్లేశ్‌ను ప్రతిష్టాత్మక ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) ప్రత్యేక జ్యూరీ అవార్డు వరించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. మల్లేశ్ ప్రస్తుతం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, అదుపు చేయడానికి చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు అందించారని ఆయన తెలిపారు.



జిల్లా కేంద్రంలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

కమల దళంలో

నూతనోత్సాహం

భారతీయ జనతా పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఎన్నికలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో పార్టీ అభ్యర్థి విజయం సాధించడంతో మంగళవారం జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. ఇదే జోరుతో స్థానిక సంస్థల ఎన్నికలలోనూ సత్తా చాటుతామన్న ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

- టీచర్ ఎమ్మెల్సీ గెలుపు, పట్టభద్రుల స్థానంలో ఆధిక్యం
- సంబురాలు చేసుకున్న బీజేపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓట్లతోనే ఆయన విజయ తీరాలకు చేరారు. ఇది ఆ పార్టీ శ్రేణులలో ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్రంలో శాసన మండలిని పునరుద్ధరించిన నాటి నుంచి మెదక్ – కరీంనగర్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని పీఆర్‌టీయూనే గెలుస్తూ వచ్చింది. ఉపాధ్యాయ సంఘాలే అభ్యర్థులను నిలబెడుతూ వచ్చాయి. అయితే ఈసారి అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిని బరిలో దించింది. అంతేకాకుండా పార్టీ అభ్యర్థి గెలుపుకోసం రాష్ట్ర నాయకత్వం విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఉపాధ్యాయులను తమవైపు తిప్పుకునేందుకు ఆ పార్టీ నేతలు చేసిన ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. తొలి ప్రాధాన్యత ఓట్లతోనే బీజేపీ అభ్యర్థి గెలుపొందడమే దీనికి నిదర్శనం.

'స్థానిక' ఎన్నికలకు బూస్ట్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయం సాధించడం, పట్టభద్రుల స్థానంలోనూ ఆధిక్యంలో ఉండడం ఆ పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కొమురయ్య గెలుపొందడంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. రాబోయే మున్సిపల్, మండల, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామన్న ధీమా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

పెరిగిన బలం..

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. అదీ అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిలను ఆయన ఓడించి జేయింట్ కిల్లర్‌గా అవతరించారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడినప్పటికీ గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఓడినా.. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఆ పార్టీకే మెజారిటీ వచ్చింది. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలో కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి.

నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలలో బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కమల దళానికి నలుగురు ఎమ్మెల్యేల బలం ఉంది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పార్లమెంట్ స్థానాలూ బీజేపీ ఖాతాలోనే ఉన్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ.. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థి విజయం కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేశారు. దీంతో ఆ పార్టీ ఆశించిన ఫలితాన్ని సాధించిందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

టపాకాయలు కాల్చి.. స్వీట్లు పంచి..

కామారెడ్డి టౌన్ : ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు నరేందర్, రవీందర్, విజయ్, రాజు, వేణు, రఘు, ప్రతాప్ పాల్గొన్నారు.

తేలని ఫలితం.. వీడని ఉత్కంఠ



కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

పోటీ త్రిముఖం

- కోటా ఓట్ల మార్కును చేరుకోని అభ్యర్థులు
- ఎలిమినేషన్ ప్రక్రియతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం
- ప్రస్తుతం ఆధిక్యంలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

కౌంటింగ్ వివరాలు :	
మొత్తం ఓట్లు (పోస్టల్ ఓట్లతో కలిపి)	2,52,000
చెల్లని ఓట్లు	28,000 (11.01శాతం)
చెల్లుబాటైనవి	2,24,000
విన్నింగ్ కోటా ఓట్లు	1,12,001 (సుమారు)
బరిలో నిలిచిన అభ్యర్థులు	56

సాక్షి,పెద్దపల్లి : ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం ఉత్కంఠను రేపుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన కౌంటింగ్‌లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు పోటాపోటీగా ఓట్లు సాధించారు. ఏ ఒక్క అభ్యర్థి నేరుగా కోటా ఓట్లు చేరుకునే అవకాశాలు కనిపించలేదు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపోటములు తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లపై అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తం చెల్లుబాటైన ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా ఫలితం తేలనుంది. ట్రయాంగిల్‌గా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోరు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది.

పోటాపోటీగా ఓట్లు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీపడినా.. ప్రధానంగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ విస్తృత ప్రచారం చేశారు. దానికి అనుగుణంగానే ఈ ముగ్గురికి పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. 6వ రౌండ్ పూర్తయ్యే సమయానికి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు ముగ్గురు కలిసి సుమారు లక్ష ఓట్లు సాధించగా, బరిలో నిలిచిన 53 మంది అభ్యర్థులందరూ కలిపి కేవలం 10 వేల లోపు ఓట్లు మాత్రమే సాధించారు. దీంతో మూడోస్థానంలో నిలిచే అభ్యర్థి ఎవరనేదానిపై ఎమ్మెల్సీ ఫలితం ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

విన్నింగ్ కోటాకూ దూరంగా..

పోస్టల్ ఓట్లతో కలిసి మొత్తం 2,52,000 ఓట్లు పోలవగా, అందులో సుమారు 28 వేల ఓట్లు చెల్లనివిగా అధికారులు నిర్ధారించారు. చెల్లని ఓట్లు పోగా మిగిలిన 2,24,000 ఓట్లలో సగం ఓట్లు.. అంటే 1,12,001 ఓట్లను విన్నింగ్ కోటా ఓట్లుగా నిర్ధారించారు. పోటీలో ఉన్న ఏ ఒక్క అభ్యర్థి నేరుగా కోటా ఓట్లను సాధించే పరిస్థితి కానరావడం లేదు. దీంతో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేషన్ చేస్తూ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది. ఈ ప్రక్రియ పూర్తిచేసి ఫలితం తేలేందుకు బుధవారం రాత్రి వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు.

ప్రతి రౌండ్‌లో..

మొత్తం 21 టేబుళ్ల ద్వారా 12 రౌండల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మొదటి రౌండ్‌లో బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థిపై 36 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండోరౌండ్‌లో 1,457 ఓట్ల మెజార్టీ, మూడోరౌండ్‌లో 3,005 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 1,263 ఓట్లు, ఐదోరౌండ్‌లో 1,381 ఓట్ల మెజార్టీ వచ్చింది. 6వ రౌండ్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిపై 211 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తంగా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 45,401 ఓట్లు సాధించి ప్రత్యర్థులపై 6,931 ఓట్ల మెజార్టీతో అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. 38,470 ఓట్లతో నరేందర్ రెడ్డి సెకండ్ ప్లేస్‌లో, 31,481 ఓట్లతో ప్రసన్న హరికృష్ణ మూడోస్థానంలో నిలిచారు. మందకొడిగా సాగుతున్న కౌంటింగ్ ప్రక్రియకు తోడు పోటాపోటీగా అభ్యర్థులు ఓట్లు సాధిస్తుండటంతో రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠ పెరిగింది. రెండో ప్రాధాన్యత ఓట్లపైనే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

రైతులకు సాంకేతికతను చేరువ చేయాలి

- పొలాస పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి శ్రీలత సూచన



మాట్లాడుతున్న పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి శ్రీలత

రుద్రూర్: వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పని చేస్తూ రైతులకు సాంకేతికతను మరింత చేరువ చేయాలని పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి, సహ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె హాజరయ్యారు. జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం, కామరెడ్డి జిల్లాలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గత ఏడాది చేపట్టిన పరిశోధన అంశాల మీద, వచ్చే వానకాలం, యాసంగి సీజన్‌లలో చేపట్టబోయే పరిశోధన అంశాలపై సమీక్ష నిర్వహించి తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా రుద్రూర్ కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ అంజయ్య మాట్లాడుతూ ప్రణాళిక రూపొందించుకుని రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్, బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ జగన్నాథచారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, శాస్త్రీయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

స్థానికుల వద్ద టోల్ వసూలు చేయొద్దు

- రామేశ్వర్‌పల్లి రైతుల డిమాండ్
- భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద నిరసన



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న రామేశ్వర్‌పల్లి గ్రామస్తులు

భిక్కనూరు : ''మా పొలాలు జాతీయ రహదారి పక్కన ఉన్నాయి. పొలాల వద్దకు రోజూ రెండు మూడుసార్లు వెళ్లి వస్తాం. ఇంతకు ముందెప్పుడూ మా వాహనాలకు టోల్ ట్యాక్స్ వసూలు చేయలేదు. ఇప్పుడు కొత్తగా ఎందుకు వసూలు చేస్తున్నారు'' అంటూ రామేశ్వర్‌పల్లి గ్రామస్తులు భిక్కనూరు టోల్ ప్లాజా నిర్వాహకులను నిలదీశారు. మంగళవారం టోల్‌ప్లాజా వద్దకు వచ్చి నిరసన తెలిపారు. టోల్ గేట్ బూత్‌లను మూయించి, గేట్లను తెరిపించి సుమారు 45 నిమిషాలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భిక్కనూరులో టోల్ ప్లాజా ఏర్పాటైనప్పటినుంచి తమ వద్ద నుంచి ఎప్పుడూ టోల్ ట్యాక్స్ వసూలు చేయలేదన్నారు. ఇప్పుడు కొత్త కాంట్రాక్టర్ తమ వాహనాలకు టోల్ వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టోల్ ప్లాజా ఇన్‌చార్జి ప్రకాశ్ ఆందోళనకారుల వద్దకు వచ్చి మాట్లాడారు. సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. యాజమాన్యంనుంచి స్పందన వచ్చేంతవరకు లోకల్ ఆధార్ కార్డు చూపించిన వారికి టోల్ ట్యాక్స్ వసూలు చేయబోమన్నారు. దీంతో రామేశ్వర్ పల్లివాసులు శాంతించి, ఆందోళన విరమించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచన



కామారెడ్డిలోని పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారంనుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఫస్టియర్ పరీక్షలకు 8,743 మంది, సెకండియర్ పరీక్షలకు 9,729 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరికోసం జిల్లావ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఇంటర్ వార్షిక పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నారు. కాగా ఈసారి ప్రతి ప్రశ్నపత్రానికి యునిక్ సీరియల్ నంబర్ ఇచ్చారు. దీంతో పేపర్ లీకైతే ఎవరినుంచి లీకయ్యిందో తేలికగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి సలాం

బాన్సువాడ : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్‌అధికారి షేక్ సలాం పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు బాగా పరీక్షలు రాయాలని సూచించారు.

ఘనంగా వన్యప్రాణి దినోత్సవం



వన్యప్రాణుల చిత్రాల వాల్‌పోస్టర్‌తో విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్ష, అటవీ శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వన్యప్రాణుల ఫొటోలు, సమాచారాన్ని వివరించే వాల్ పోస్టర్లను రూపొందించారు. విద్యార్థులు దీపిక, సానియ, నవ్యశ్రీ, సమన్విత, సిరి, పూజ, శశికుమార్, సాత్విక, అనిల్‌కుమార్, శ్రీశ్రేయ, శ్రావణి వాటిని ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఆయా విభాగాల ప్రతినిధులు దినకర్, శ్రీవల్లి, శ్రీలత, స్వాతి, వెన్నెల వర్షిణి, రమణ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించడానికే కవాతు

- కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి
- జిల్లా కేంద్రంలో ప్రత్యేక బలగాల ఫ్లాగ్ మార్చ్

కామారెడ్డి క్రైం : ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ నుంచి ప్రారంభమైన కవాతు డైలీ మార్కెట్, సుభాష్ రోడ్, పాన్ చౌరస్తా, బడా మసీద్, నిజాం సాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, రైల్వే గేట్, బతుకమ్మ కుంట, పాత బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ చైతన్యరెడ్డి మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి సికింద్రాబాద్‌లో ఉండే 99వ బెటాలియన్‌కు చెందిన ప్రత్యేక బలగాల బృందం జిల్లాకు వచ్చిందన్నారు. ఎప్పుడైనా జిల్లాలో శాంతిభద్రతల సమస్య, మత ఘర్షణలు లాంటివి జరిగితే బెటాలియన్ బలగాలు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు సహకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు సంతోష్ కుమార్, కృష్ణ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, సీఐలు హరిబాబు, మల్లేశ్వరరావు, 145 మంది సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో కవాతులో పాల్గొన్న ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్ఏఎఫ్ బలగాలు

క్లుప్తంగా

పరీక్ష రాయడానికి అనుమతిచ్చారు

మద్నూర్(జుక్కల్): ఇంటర్మీడియట్ పరీక్షలకు అనుమ తి లేక బాధపడుతున్న ఇద్దరు విద్యార్థులకు మంగళవా రం అనుమతి ల భించినట్లు స్థానిక ప్రభుత్వ జూనియ ర్ కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పాండురంగ్ తెలిపారు. మంగళవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన 'ఇంటర్ పరీక్షలకు అనుమతివ్వండి సార్..!' అనే వార్తా కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లగా వెంటనే నోడల్ అధికారి షేక్ సలామ్‌ను పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులు అప్పస్వార్ దేవిదాస్, చౌడేకర్ అవినాష్‌లకు సహాయకులుగా ఇద్దరు విద్యార్థులను ఏర్పాటు చేసుకొని ఇంటర్ పరీక్షలకు హాజరు కావచ్చని పాండురంగ్ చెప్పారు. మరో విద్యార్థి బేతే రాములు సహాయకుడి కోసం దరఖాస్తు చేసుకోక పోవడంతో ఆ విద్యార్థికి అనుమతి రాలేదన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత

రాజంపేట: రాజంపేట మండలం నడిమితండాలో సోమవారం అర్ధరాత్రి కొందరు అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పోలీసులు పట్టుకున్నారు.తండాలో ఇసుక దందా జోరుగా సాగుతోందని 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన జోరుగా ఇసుక దందా అనే కథనాన్ని అధికారులు స్పందించారు. సోమవారం అర్ధరాత్రి తండా శివారు నుంచి ఐదు ట్రాక్టర్లు, ఒక టిప్పర్ ద్వారా తరలిస్తున్న ఇసుకను పోలీసులు పట్టుకున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చదువుతోనే భవిష్యత్తు

● జిల్లా న్యాయమూర్తి నాగరాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

కామారెడ్డి టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి విద్యార్థులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని సందర్శించారు. చిన్నారులతో మాట్లాడి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. వంటగది, స్టోర్‌రూం, గదులను తనిఖీ చేశారు. నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ శిలాఫలకం ధ్వంసం

మాచారెడ్డి: పాల్వంచ మండలం పోతారంలో గుర్తు తెలియని వ్యక్తులు బీఆర్‌ఎస్ జెండా గద్దెతో పాటు సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పైడాకుల రాములు గద్దె, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ వాహనం బోల్తా

బోధన్‌రూరల్:మండలంలోని బండార్‌పల్లి శివారులో రూరల్ పీఎస్‌కు చెందిన పోలీస్ వాహనం టైర్ పేలి బోల్తాపడింది. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం బోధన్ మండలం బండార్‌పల్లికి వెళ్లి వస్తుండగా గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద వాహనం టైర్ పేలింది. దీంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలో బోల్తా పడింది. వాహనంలో డ్రైవర్ మాత్రమే ఉండటంతో ప్రమాదం తప్పింది.

సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు

- మునిపల్లిలోని ఓ భూవివాదంలో డిచ్‌పల్లి సీఐ, జక్రాన్‌పల్లి ఎస్సై, కానిస్టేబుల్‌పై..
- హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీపీలు విచారణ జరపాలి
- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు జస్టిస్ బి విజయసేన్‌రెడ్డి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ మహేందర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషనర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన రావుట్ల అలియాస్ రాగుట్ల నచ్చన్నకు సర్వే నంబర్ 197/ఆలో ఎకరం భూమి ఉంది. ఈ భూమిలో వడ్డెర కులానికి చెందిన పలువురు దేవుడి ప్రతిమను ఏర్పాటు చేసి షెడ్డు నిర్మాణం చేపట్టారు. నచ్చన్న పని నిమిత్తం భూమి వద్దకు వెళ్లగా అక్కడ షెడ్డు నిర్మించి ఉన్నట్లు గుర్తించి తనకు తెలిసిన వారికి, కులస్తులకు సమాచారం అందించి అక్కడికి వెళ్లారు. షెడ్డు నిర్మాణం ఎలా చేపట్టారని నచ్చన్న తరఫున వారు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో నచ్చన్నతోపాటు ఆయన తరఫున వచ్చిన కులస్తులు జక్రాన్‌పల్లి పీఎస్‌కు వెళ్లి ఎస్సై తిరుపతికి ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌కు ఫిర్యాదు చేసి మళ్లీ భూమి వద్దకు వెళ్లారు. భూమిలో పంట వేస్తుండగా జక్రాన్‌పల్లి పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ మహేందర్ అక్కడికి చేరుకుని పనులు నిలిపివేయాలని నచ్చన్నతోపాటు మహిళలు, కులస్తులను హెచ్చరిస్తూ మహిళలను అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టును నచ్చన్న ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్ 2న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తోపాటు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్పెషల్ జడ్జి, ఎస్సీ, ఎస్టీ యాక్ట్, డిస్ట్రిక్ట్ అడిషనల్-2 జడ్జి టి శ్రీనివాస్ తీర్పు వెలువరించి ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు పంపించారు. కానీ రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసు కోకపోవడంతో దీనిపై నచ్చన్న ఈ ఏడాది జనవరి 24న హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తోపాటు కానిస్టేబుల్ మహేందర్ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకువాలని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ అట్రాసిటీ కేసు నమోదు చేసి దీనికి సంబంధించిన నివేదిక 30 రోజుల్లో అందించాలని గత నెల 4న కలెక్టర్, సీపీ, జక్రాన్‌పల్లి తహసీల్దార్, జక్రాన్‌పల్లి పీఎస్ ఎస్సై తిరుపతికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సెక్రెటరీ జీఎస్ పాండాదాస్ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది డిసెంబర్ 24న జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయకపోవడంతో గత నెల 27న బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి, భూమిలోని షెడ్డును తొలగించి బాధితుడికి అప్పగించాలని హైకోర్టు జస్టిస్ బి విజయసేన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు కేసు నమోదు చేయకపోవడానికి గల కారణాలపై హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, పోలీస్‌కమిషనర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. భూమిలో ఉన్న దానిని తొలగించకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేయకుండా స్థానికంగా ఒత్తిడితోనే ఈ భూమి వ్యవహారం వివాదంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలీసులు పట్టించుకోలేదు



నా భూమిలో దేవుడి ప్రతిమలు పెట్టి షెడ్డు నిర్మించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. దీంతో కోర్టుకు వెళ్లాను. పోలీసుల పై చర్యలు తీసుకోవాలి. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ భూమిని నాకు అందించాలి.

– నచ్చన్న, మునిపల్లి, జక్రాన్‌పల్లి

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అదనపు కలెక్టర్ విక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భిక్కనూరు: రెవెన్యూ అధికారులు రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం ఆయన భిక్కనూరు తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులకు సేవలు అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుడతున్న పథకాలను అర్హులందరికి అందేలా చూడాలన్నారు. రేషన్ కార్డుల మంజూరులో ప్రభుత్వ నిబంధలనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రోజా, ఆర్‌ఐ బాలయ్య ఉన్నారు.

ఉపాధి కూలీల హాజరు శాతం పెంచాలి



ఫిష్ పాండ్ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, మండల అధికారులకు సూచించారు. మంగళవారం శివాపూర్ శివారులో జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పని ప్రదేశాలల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, కొలతల ప్రకారం పనులు చేపట్టాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం 8 గంటలకు పనులు చేపట్టే విధంగా ప్రణాళిక చేపట్టాలని, పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు, మంచి నీళ్ల ఉంచాలన్నారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఏపీవో సుదర్శన్, టీఏ బాలాజీ, కార్యదర్శి మస్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు అందజేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాలకు రుణాలు అందజేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం లింగంపేట సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆరు మండలాలు గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, నాగిరెడ్డిపేటకు చెందిన సీసీలు, ఏపీఎంలతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అర్హులకు అందజేయాలని ఆదేశించారు. అలాగే మొండి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. మహిళా శక్తి, జీవనోపాధి కల్పన తదితర అంశాలపై చర్చించారు. అదనపు డీఆర్డీవో మురళీకృష్ణ, డీపీఎం రవీందర్‌రావు, ఆర్‌ఎం కిరణ్, ఎస్‌వీఈపీ ఏపీఎం రాజేందర్, ఏపీఎంలు ప్రసన్నరాణిరామ్, తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు కేరాఫ్ ఆ తండా

● గజ్యానాయక్ తండా చౌరస్తాలో కబ్జాలపై సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు ఆరోపణలు

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తా వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వారాంతపు సంతతో పాటు ఊర చెరువు శిఖాన్ని కబ్జా చేస్తున్నారని రెండు, మూడు రోజులుగా సోషల్ మీడియాలో ఒకరిపైఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన అజీమ్ సంత స్థలంలో రేకుల షెడ్డు వేశాడని అధికారులకు మాజీ ఉప సర్పంచ్ తోకల కిషన్ ఫిర్యాదు చేశారు. దీంతో అజీమ్ సోదరుడు అజీజ్ దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వివాదం ముదిరింది. దీంతో మంగళవారం తహసీల్దార్ శ్వేత, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. గతంలో కూడా తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పుడు మాచారెడ్డి చౌరస్తాను గజ్యా నాయక్ తండాలో కలపడంపై తీవ్ర వివాదం చెలరేగింది. అనంతరం సంత మాదంటే మాదని అటు మాచారెడ్డివాసులు, ఇటు గజ్యానాయక్ తండాచౌరస్తా వాసులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. అప్పుడు పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. మళ్లీ తాజాగా కబ్జాల తతంగంతో మరోసారి వివాదానికి తెరలేపినట్లయింది.

కోట దుర్గమ్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయంలో మంగళవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట దుర్గమ్మ ఆలయం ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు, పల్లకీ సేవ నిర్వహించారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న మహిళలు

ముగిసిన అఖండ హరినామ సప్తాహం

పిట్లం(జుక్కల్): గౌరారంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం మంగళవారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు హనుమంతరావు పటేల్, గ్రామ కమిటీ భజన మండలి కొంద్ర విటల్, మాజీ సర్పంచ్ అనసూయ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం



కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంఘం నాయకులు మోతే రామాగౌడ్, కల్వరాల గంగాగౌడ్, తదితరులు ఉన్నారు.

బోనాల ఊరేగింపు



బోనాలను ఊరేగిస్తున్న గౌడ సంఘం మహిళలు

రాజంపేట: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి తండాలో మంగళవారం సేవాలాల్, జగదాంబదేవి ఆలయాల వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ లోక్యానాయక్, శంకర్, మురళి, దూప్‌సింగ్, రాజు,శివలాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి బోనాలను సైతం సమర్పించారు. నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న మేజర్‌వాడి గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మేజర్‌వాడిలో మంగళవారం పెద్దమ్మతల్లి, మల్లిఖార్జునస్వామి విగ్రహాలను ఊరేగించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేక పూజలు చేశారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అభిజిత్ (ఫైల్)

తాడ్వాయి: పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన బంగారుగల్ల అభిజిత్(24) అనే యువకుడు చిన్న నాటి నుంచి అమ్మమ్మ శాంతవ్వ వద్ద పెరుగుతున్నాడు. పనిచేసుకుంటు బతకాలని అభిజిత్‌ను అమ్మమ్మ బెదిరించడంతో ఈ నెల 1న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంటి తండాలో పునాదులు ధ్వంసం



పునాదులను ధ్వంసం చేస్తున్న అధికారులు

మాచారెడ్డి: తాతల నాటి నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ గిరిజన రైతు అక్కడ ఇంటి నిర్మాణం కోసం తీసిన పునాదులను మంగళవారం అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం గుంటి తండాకు చెందిన లకావత్ లచ్చిరాం కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ కుటుంబంతో గుడిసెలో నివాసం ఉంటున్నాడు. గుడిసెను తొలగించి ఇల్లు కట్టుకోవాలని ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్ తెప్పించుకొని పునాదులు తవ్వించాడు. అటవీ శాఖ అధికారులు మంగళవారం పొక్లెయిన్‌తో పునాదులను ధ్వంసం చేశారు. ఈ విషయమై మాచారెడ్డి ఎఫ్‌ఆర్వో దివ్యను వివరణ కోరగా అటవీ స్థలంలో ఇల్లు నిర్మిస్తున్నారన్న సమాచారం మేరకు రెండుసార్లు నోటీసులు ఇచ్చినా ఇంటి నిర్మాణ పనులు చేపట్టారని, ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ స్థలంలో నిర్మిస్తున్న ఇంటి పునాదులను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 11 గొర్రెలు మృతి



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండాలో కుక్కల గుంపు దాడి చేయడంతో చందర్‌కు చెందిన 11 గొర్రెలు మంగళవారం మృతిచెందాయి. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన చందర్ 18 గొర్రెలను ఇంటి ఆవరణలోనే పెంచుతున్నాడు. రోజులాగే పొలానికి నీరు పెట్టేందుకు మధ్యాహ్నం వెళ్లాడు. కుక్కల గుంపు ఒక్కసారిగా గొర్రెలపై దాడి చేయడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల మృతితో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు చందర్ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎడపల్లి: జానకంపేట శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల కాలువలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం లిఫ్ట్ పంప్ హౌస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాలువ నుంచి ఈతగాళ్ల సాయంతో బయటకు తీయించారు. మృతదేమం పూర్తిగా కుళ్లిపోయిందని, ఒంటిపై ఎలాంటి గాయాలు లేవన్నారు. లిఫ్ట్ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవమానించాడని స్నేహితుడిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: తనతో పాటు కుమారులను అవమానించడనే కోపంతో ఓ తండ్రి స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన నగరంలోని గాజులపేట్‌లో చేసుకుంది. రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గాజులపేట్‌కు చెందిన మహేశ్, సంతోష్ ఇద్దరు స్నేహితులు. వీరు ఓ చోట మద్యం సేవించి ఇరుకుటుంబాల గురించి చర్చించుకున్నారు. ఈ క్రమంలో సంతోష్ కుమారులకు నత్తి ఉందని మహేశ్ అనడంతో గొడవ జరిగింది. దీంతో సంతోష్ తనను, తన కుమారులను అవమానించాడనే కోపంతో ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి మహేశ్‌పై దాడి చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్ద పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. నగరంలోని ముస్తాయిపురాకు చెందిన షేక్ అహ్మద్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంకు బైక్‌పై వచ్చాడు. బైక్ పార్క్ చేసి ఏటీఎం లోపలికి వెళ్లి వచ్చే సరికి బైక్ చోరీకి గురైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి పేర్కొన్నారు.

పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

ఖలీల్‌వాడి/ నందిపేట్: నకిలీ గల్ఫ్ ఏజెంట్ దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి నా పట్టించుకోవ డం లేదంటు బాధితులు భూపతి నరసింహ మూర్తి, మహేశ్‌లు హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసిన గల్ఫ్ నకిలీ ఏజెంట్‌లపై నందిపేట్ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసినా కేసులో పురోగతి లేదన్నారు. దీనిపై విచారణ చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంగళవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో ఒకరు, మద్యానికి బానిసై మరొకరు, కుటుంబ కలహాలతో ఒకరు, పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.



గంధం గంగాధర్ మృతదేహం

నందిపేట్: అప్పుల బాధతో ఒకరు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నందిపేట మండలం అయిలాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన గంధం గంగాధర్(46) మూడేళ్ల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లి నెల రోజుల క్రితం తిరిగి వచ్చాడు. దీంతో చేసిన అప్పులు ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయి అయిలాపూర్ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడు..



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

లింగంపేట: పెళ్లి కావడం లేదనే మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట మండలం శెట్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి ప్రవీణ్‌కుమార్(27) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తల్లిదండ్రులు గతంలో చనిపోయారు. అక్క మౌనికతో కలిసి ఉంటున్నా డు. అనారోగ్యానికి గురైన బంధువులను పరామర్శించేందుకు మౌనిక వేరే గ్రామానికి పది రోజుల క్రితం వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ప్రవీణ్ కుమార్ తనకు ఇంకా వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

పిట్లం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండలం చిల్లర్గిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి ప్రకాశ్(37) కొంత కాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయకుండా తిరుగుతున్నాడు. జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమార్‌పేట్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డికి చెందిన మ్యాతరి సతీశ్(42) ఇంట్లో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపంతో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు ఏజెంట్ల అరెస్ట్

ఖలీల్‌వాడి: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిజామాబాద్ జిల్లా యువకులను మోసం చేసిన ముగ్గురు ఏజెంట్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాకు చెందిన అలకుంట సంపత్, జగిత్యాల జిల్లాకు చెందిన దండుగుల చిరంజీవి, మిట్టపల్లి నర్సారెడ్డిలు థాయిలాండ్, లావోస్ దేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి జిల్లాకు చెందిన బాధితుల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేశారు. వీరిని లావోస్ దేశంలో బంధించి సైబర్ నేరాలు చేయించారు. చివరికి ఇద్దరు బాధితులు భారతీయ రాయబార కార్యాలయం సహాయంతో స్వదేశానికి తిరిగి వచ్చి ఏజెంట్లపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏజెంట్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. వీరిని సారంగాపూర్ జిల్లా జైలుకు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.